గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైందని, తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి రిక్రూంట్‌మెంట్‌ను త్వరగా పూర్తిచేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేస్తే నిరుద్యోగులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో హైకోర్టు తీర్పుపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ గ్రూప్-1 ఫలితాల్లో తెలుగు మీడియం వారికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. పరీక్ష రాసిన 719 మందికి ఒకే విధంగా మార్కులు రావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. డబ్బుకోసం అక్రమాలకు పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, నందగోపాల్, పగిళ్ల సతీష్, వంశీకృష్ణ, రాందేవ్‌మోది తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్ఏ నాయకులు

పరీక్ష రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎం.శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో టీజీపీఎస్‌సీ నిర్లక్ష్య వైఖరి బహిర్గతం అయిందన్నారు. అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి రాజేష్ చౌహాన్, సురేష్, రాజ్‌కుమార్ యాదవ్, పృథ్వీరాజ్, వినోద్ పాల్గొన్నారు.

చైతన్య యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ చీమ శ్రీనివాస్ తదితరులు

నేటి నుంచి ఉద్యమకారుల చైతన్య యాత్ర

బర్కత్‌పుర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13 నుంచి రెండు నెలల పాటు 584 మండలాల్లో చైతన్యయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. యాత్ర శనివారం ఉదయం 11 గంటలకు ఎల్‌బీనగర్ చౌరస్తాలోని శ్రీకాంత్‌చారి విగ్రహం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉద్యోగ నియామకాల్లో ఉద్యమకారులకు 20 శాతం కోటా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సురేందర్‌రెడ్డి, నాయకులు దయానంద్, వీరస్వామి, రజనీకాంత్, సుదర్శన్, జగన్‌యాదవ్, ఆర్‌పీఐ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ గౌడ్

బీసీ ఉద్యోగుల సంఘానికి గుర్తింపునివ్వాలి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలనీ, క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వారాల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ ఉద్యోగుల వివరాలు బీసీ కమిషన్‌కు సమర్పించాలని, పెండింగ్ బిల్స్, రిటైర్‌మెంట్ బకాయిలను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. జ్ఞానేశ్వర్, కార్యదర్శి అనురాధ, మహేంద్రసాగర్, యాదన్న తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి బాధ్యతల స్వీకరణ

అడ్డగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. 2006లో వరంగల్ కేఎంసీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఏడాదిపాటు అదనపు డీఎంఈ, డీఎంఈగా పనిచేశారు.

శివారు ప్రయాణికులే లక్ష్యంగా కొత్త బస్ రూట్లు

- ఐటీ కారిడార్ కేంద్రంగా బస్సుల సంఖ్య పెంపు
- ఎక్కువ మంది ప్రయాణాలు సాగించే మార్గాలపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాల ప్రయాణికులే లక్ష్యంగా కొత్త బస్‌రూట్లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతోంది. గ్రేటర్‌జోన్ పరిధిలో ఆర్టీసీ 700కు పైగా రూట్లలో బస్సులు నడుపుతుండగా మరిన్ని కొత్త రూట్లపై దృష్టిపెట్టింది. మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, మియాపూర్, ఉప్పల్, ఎల్‌బీనగర్, ఈసీఐఎల్, పటాన్‌చెరు వంటి ప్రాంతాల నుంచి సమీపంలో 20 కిలోమీటర్ల పరిధిలో కొత్తగా వెలుస్తున్న కాలనీలు, గెటెడ్ కమ్యూనిటీలకు బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ఎక్కువ మంది ప్రయాణాలు సాగిస్తున్న రూట్లలో 25 బస్ డిపోల మేనేజర్లు క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ ప్రయాణికుల రద్దీ వివరాలు సేకరిస్తున్నారు. ఆఫీస్, కాలేజీ సమయాల్లో ఉదయం, సాయంత్రం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల ట్రిప్పులు పెంచేదిశగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది.

ఐటీ కారిడార్ కేంద్రంగా ఎలక్ట్రిక్ బస్సులు

గ్రేటర్‌లోని ప్రధాన ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌కు ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో నడిపే దిశగా ఆర్టీసీ చర్యలు చేపడుతుంది. అక్టోబరు, నవంబరు నెలలో అందుబాటులోకి తీసుకురాబోతున్న 275 ఎలక్ట్రిక్ బస్సులను ఐటీ కారిడార్ కేంద్రంగా నడిపేందుకు పరిశీలిస్తున్నారు. మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాలకు శివారు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మెట్రో డీలక్స్ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటుంది.

ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి

వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన శైలజా రామయ్యర్

చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యర్

రాంనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని ఇండస్ట్రీస్ కామర్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, టెస్కో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా రామయ్యర్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం టెస్కో ఆధ్వర్యంలో శుక్రవారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించడం, వినియోగదారులకు నాణ్యమైన చేనేత వస్త్రాలు సరసమైన ధరలకు అందించడమే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర చేనేత సహకారం సంఘం (టీజీఎస్‌సీవో) పనిచేస్తుందన్నారు. ఈ నెల 12 నుంచి నవంబరు 12వ తేదీ వరకు వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. తగ్గింపు ధరలకు వస్త్రాలు విక్రయిస్తారన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, ఇక్కత్, గద్వాల, నారాయణపేట, గొల్లభామ పట్టు చీరలు, సీకో చీరలు, కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ రెడీమేడ్స్, లుంగీలు, టవల్స్, దుప్పట్లు, కలంకారి, ఖాదీ వస్త్రాలతో పాటు రాజమండ్రి, వెంకటగిరి, బందరు, ధర్మవరం చీరలు ప్రదర్శనలో అమ్మకానికి ఉంచారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో టెస్కో మేనేజింగ్ డైరెక్టర్ రఘునందన్‌రావు, ఓఎస్‌డీ రతన్‌కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, డివిజనల్ మార్కెటింగ్ అధికారి కళింగరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు సందీప్‌జోషి, కేటీచారి, మాధడి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పిండం అభివృద్ధి దశలోనే క్యాన్సర్ కణితుల రూపాంతరం

వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు జీవనశైలి కూడా పిల్లల క్యాన్సర్‌కు కారణమవుతుందని వైద్యులు అంటున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లో కామినేని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులు మాట్లాడారు. ప్రతీ ఏడాది సెప్టెంబరు నెలను పిల్లల క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తారని తెలిపారు. పిల్లలు పుట్టకముందే పిండం అభివృద్ధి చెందే దశలో ఉండగానే కొన్ని రకాల కణాలు క్యాన్సర్ కణితులుగా రూపాంతరం చెందుతాయని, అవి వేగంగా పెరిగితే చిన్న వయస్సులో క్యాన్సర్ బయటపడుతుందని డాక్టర్ కంచన్ ఎస్. చన్నావర్ చెప్పారు. జన్యుపరమైన పరీక్షలు చేస్తే కొన్ని రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చన్నారు జెనెటిక్స్ మాలిక్యులర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అనీ క్యూ హసన్ అన్నారు. దేశంలో పిల్లలకు వస్తున్న మొత్తం క్యాన్సర్ కేసుల్లో 5శాతం తెలుగు రాష్ట్రాల్లోనే ఉంటున్నాయని, పిల్లల క్యాన్సర్ కేసుల్లో 5నుంచి 10 శాతం జన్యుపరమైన కారణాలని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కార్పొరేషన్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కార్పొరేషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అధ్యక్షతన శుక్రవారం బోర్డు సమావేశం జరిగింది. నిరుద్యోగ దివ్యాంగులను ఉద్యోగులుగా మార్చడం, పారా క్రీడాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు తీర్మానాలను ఆమోదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధం అవడానికి దివ్యాంగులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఏడాది పొడవునా ఉచితంగా కోచింగ్ అందించాలని నిర్ణయించారు. పారా స్పోర్ట్స్‌లో ప్రతిభ ఉన్న దివ్యాంగులను ప్రోత్సహించడానికి జిల్లా స్థాయిలో క్రీడా వారోత్సవాలు నిర్వహించి రాష్ట్ర స్థాయిలో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలని, క్రీడా సామగ్రి అందించడానికి రూ.50లక్షల నిధులు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. దృష్టిలోపం ఉన్న నిరుద్యోగ దివ్యాంగుల కోసం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో డిజిటల్ యాక్సెసబుల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని, దీనికి రూ.10లక్షలు కేటాయించాలని తీర్మానంలో పేర్కొన్నారు.

పోకిరీలు వేధిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయండి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోకిరీలు వేధిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషారాణి మహిళలు, బాలికలకు సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 15 రోజుల్లో మహిళలను వేధిస్తున్న 214 మందిని షీటీమ్స్ పట్టుకున్నాయి. ఐదుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, మిగతా వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు.

మ్యాట్రిమోనీ సైట్‌లో పాకిస్థానీ యూట్యూబర్ ఫొటో

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ. 25 లక్షలు కాజేసిన ముఠా
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరో మహిళ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోనీ సైట్‌ను ప్రారంభించి, అందులో అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి మోసాలు చేస్తున్న ముఠాలోని ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు పాకిస్థానీ యూట్యూబర్ ఫొటో పెట్టి, ఆమెనే పెళ్లి కూతురుగా చూపించి నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారని సైబర్ క్రైం అధికారులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బిజాపూర్‌కు చెందిన అనీసా మహ్మదైసయీమ్(33), జోహర్ ఫాతిమా(24), నగరానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అమేర్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఖుబ్‌సూరత్ రిస్తే పేరుతో వెబ్‌సైట్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు ప్రారంభించారు. ఇందులో అందమైన యువతుల ఫొటోలు పెట్టి యువకులను ఆకర్షించి మోసాలు చేస్తున్నారు. నగరానికి చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఖుబ్‌సూరత్ రిస్తే" పేరుతో ఉన్న మ్యాట్రిమోనీ పేజ్‌లో అందమైన యువతి ఫొటో చూశాడు. అందులో మహిళ ఫోన్ నంబర్ ఉండటంతో ఆమెతో మాటలు కలిపాడు. సదరు మహిళ తరచూ వీడియో కాల్స్ చేసి యువకుడితో మాట్లాడేది. త్వరలో పెళ్లి చేసుకుందామని చెప్పేది. ఆమె మాటలు నమ్మిన బాధితుడు ఆమెతో తరచూ చాటింగ్‌లో ఉండేవాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం అంటూ సాకులు చెప్పిన మహిళ పలు దఫాలుగా రూ.25 లక్షలు వసూలు చేసింది. తర్వాత మ్యాట్రిమోనీ ప్రొఫైల్‌లో తాను చూసిన యువతి ఫొటో.. పాకిస్థానీ యూట్యూబర్‌దని గ్రహించాడు. డబ్బు తిరిగి ఇవ్వమనగా నిందితులు తిరస్కరించడంతో సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులు అనీసా, అబ్దుల్ అమేర్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ట్యాబ్, ఐదు బ్యాంక్ పాస్‌బుక్‌లు, మూడు చెక్‌బుక్‌లు, మూడు డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. మరో మహిళ జోహర్ ఫాతిమా పరారీలో ఉన్నట్లు సైబర్ క్రైం అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

నిందితుడు దినేష్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టి, పెళ్లి చేసుకొని లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన కార్నె దినేష్(29) చైతన్యపురి ప్రాంతంలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రేమ పేరుతో బాలికకు(17) మాయ మాటలు చెప్పి అపహరించి పెళ్లి చేసుకొని లైంగి దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చైతన్యపురి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు నిందితుడు దినేష్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్లు..

అత్యాచారం కేసులో నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సైబరాబాద్ క్రైం విభాగం డీసీపీ ముత్యంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల నేతాజీనగర్‌కు చెందిన ఎం. సందీప్(29) ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. కిడ్నాప్ చేసినందుకు మరో ఐదేళ్ల శిక్ష విధించిందని డీసీసీ ముత్యంరెడ్డి తెలిపారు.

తనయుడికి తల్లి తలకొరివి

కొడుకుకు తలకొరివి పెడుతున్న తల్లి గౌరమ్మ

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) ఇంట్లో మరో మొగ దిక్కు లేకపోవడంతో కన్న తల్లే కొడుకుకి తలకొరివి పెట్టిన విషాదకర సంఘటన గుండ్లపోచంపల్లిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గౌరమ్మకు ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కొడుకు పవన్ అలియాస్ నరేశ్(18). వారం రోజుల క్రితం బైక్ పైనుంచి అకస్మాత్తుగా జారి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నరేశ్ శుక్రవారం మృతి చెందాడు. తల్లే కుమారుడికి తలకొరివి పెట్టడంతో స్థానికులు కంటతడిపెట్టారు.

ప్లాట్లు, ఫ్లాట్లు ఇపిస్తానంటూ రూ. కోట్లు వసూలు

నిందితుడి అరెస్ట్

కొత్త పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాట్లు, ఫ్లాట్లు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు వసూలు చేసిన నిందితుడిని ఎల్‌బీనగర్ లా అండ్ ఆర్డర్, ఎస్ ఓ టీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో డుమ్మావత్ శ్రీకాంత్ కొందరితో కలిసి క్రితిక ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో ప్లాట్ల విక్రయ కార్యాలయం ఏర్పాటు చేశాడు. నగర శివారుల్లో పలు వెంచర్లలో ప్లాట్లు విక్రయించే ముసుగులో వినియోగదారుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడని అతడి పై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఎల్‌బీనగర్‌లో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నామని, సెల్లార్ పనులు జరుగుతున్నాయని నమ్మించి ఫ్లాట్ ఇప్పిస్తానని నమ్మించి ఉప్పల్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.38.46 లక్షలు తీసుకున్నాడు. ఇలా పలువురి వద్ద డబ్బులు తీసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఏపీలో కూడా అతడిపై కేసులున్నాయి. ఎల్‌బీనగర్‌లో 13, మేడిపల్లి, సరూర్‌నగర్, వనస్థలిపురంలో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

ఆర్టీవో చలాన్ పేరుతో సైబర్ మోసం

- ఏపీకే లింక్‌లు పంపించి ఫోన్ హ్యాక్
- ఖాతాల్లో నగదుతో సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్ షాపింగ్
- రెండు కేసుల్లో బాధితుల డబ్బు రికవరీ చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో ఏపీకే లింక్‌లు పంపించి సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తాన్ని సైబర్ క్రైం సిబ్బంది రికవరీ చేశారు. మొఘల్‌పురాకు చెందిన టైలర్ (48) ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు చలాన్ పెండింగ్ ఉందంటూ 'ఆర్‌టీఓ చలాన్' పేరుతో ఏపీకే లింక్ పంపించారు. బాధితుడు లింక్‌ను ఓపెన్ చేసి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. దీంతో ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు అతడి ఖాతా నుంచి డబ్బు కాజేశారు. డబ్బు బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. బాధితుడి క్రెడిట్ కార్డు ద్వారా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్రా యాప్‌లలో షాపింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించి లావాదేవీల్లో కొన్ని ప్రాసెస్ ఉన్నట్లు గురించారు. సైబర్ నేరగాళ్లు కాజేసిన రూ.95,239లను బాధితుడి ఖాతాలో జమ అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. మరో కేసులో.. అశోక్‌నగర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి తన ఫోన్‌కు వచ్చిన ఆర్‌టీఓ చలాన్ ఏపీకే లింక్‌ను ఓపెన్ చేయగానే అతడి ఖాతా నుంచి రూ.23,532 సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం అధికారులు డబ్బు తిరిగి బాధితుడి ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

23న సికింద్రాబాద్ నుంచి జ్యోతిర్లింగ దక్షిణ్ భారత్ గౌరవ్ టూరిస్టు రైలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల యాత్రికుల కోసం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఈనెల 23న జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర భారత్‌గౌరవ్ ప్రత్యేక టూరిస్టు రైలు బయలుదేరుతోంది. ప్యాకేజీలో టూర్ ధర (ఒక్కొక్కరికి)ఎకానమీ రూ.14,100, 3 ఎసీ రూ.22,500లు, కంఫర్ట్ సెకండ్ ఏసీ రూ.29,500లుగా నిర్ణయించినట్లు ఐఆర్‌టీసీ అధికారులు తెలిపారు. వివరాలు, బుకింగ్ కోసం :9701360701, 9281030726, 9281030740, 9281495845 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వేర్వేరు ప్రాంతాల నుంచి 52 ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి 52 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 5 నుంచి 27 వరకు తిరుపతి-అనకాపల్లె-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈనెల 17 నుంచి నవంబరు 26 వరకు (బుధ) సంబల్‌పూర్- ఇరోడ్ (08311) మధ్య 11 రైళ్లు, ఈనెల 19నుంచి నవంబరు 28 వరకు (శుక్ర)ఇరోడ్- సంబల్‌పూర్ (08312) మధ్య 11 రైళ్లు, ఈనెల 15 నుంచి నవంబరు 24 వరకు (సోమ) విశాఖపట్నం- తిరుపతి(08583) మధ్య 11 రైళ్లు, ఈనెల 16నుంచి నవంబరు 25 వరకు (మంగళ) తిరుపతి-విశాఖపట్నం (08584) మధ్య 11 ప్రత్యేకరైళ్లు నడుస్తాయని వివరించారు.

'మా బృందానికి ఇబ్బందులు లేవు'

నేరేడ్‌మెట్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానస సరోవరం యాత్రకు వెళ్లిన మా బృందానికి ఎలాంటి ఇబ్బందులు లేవనీ వినాయకనగర్ డివిజన్‌కు చెందిన బహ్మం చెప్పారు. శుక్రవారం ఉదయం మానస సరోవరం దర్శించుకున్న తమ బృందం ఖాట్మండ్‌లోని పశుపతి నాథ్ దేవాలయాన్ని దర్శించుకోవడానికి వెళ్లిందని, పరిస్థితులు అనుకూలిస్తే ఆదివారం దైవ దర్శనం చేసుకుంటామని తెలిపారు.

హైబ్రిడ్ వరి పరిశోధనలో కొత్త దృక్పథం

ఐఐఆర్ఆర్‌ను సందర్శించిన కాలిఫోర్నియా ప్రతినిధులు

రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధన సంస్థను సందర్శించిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ప్రతినిధులు

రాజేంద్రనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం యూసీ డేవీస్‌కు చెందిన ప్రొఫెసర్ వెంకటేశన్ సుందరేశన్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్)ను శుక్రవారం సందర్శించింది. ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరంతో చర్చించారు. ఈ సందర్భంగా వెబ్‌నార్ నిర్వహించారు. ప్రొఫెసర్ వెంకటేశన్ సుందరేశన్ మాట్లాడుతూ హ